# ఎంత మంచివాడివి నాన్నా!

- కాకాని కమల.

సాయంత్రం 6 గంటలు కావస్తోంది.

రోజుకంటే కాస్త తొందరగా ఆఫీసు ఛాంబర్‌లోంచి బయటికి వచ్చాడు జగన్నాథరావు.

పబ్లిక్ గార్డెన్స్‌లో నర్సరీ మేళా జరుగుతోంది.

ఏమన్నా ఇండోర్ ప్లాంట్స్, బోన్సాయి, తీసుకుందామని కారు పబ్లిక్ గార్డెన్స్ వైపు పోనిచ్చాడు.

జగన్నాథానికి 50 ఏళ్లు నిండాయి. రిటైర్‌మెంటు వయసు దగ్గరికి వస్తోంది. చిన్నప్పట్నించి మొక్కల పెంపకం అంటే ఇష్టం. ఇంత వయసు వచ్చినా ఆ అభిరుచి తగ్గలేదు సరికదా వయసుతో పెరిగింది. ఉద్యోగ విరమణ తరువాత నర్సరీలు ప్రారంభించాలన్న ఆలోచన కూడా ఆయనకి వుంది.

ఆలోచిస్తూనే కారుని పబ్లిక్ గార్డెన్స్ గేటులోంచి లోపలికి తెచ్చాడు.

కనాచీకట్లు ముసిరే వేళ.

జనంతో కిటకిటలాడుతోంది నర్సరీ మేళా.

కారు పార్కుచేసి మేళా వైపుగా రాబోతున్న జగన్నాథం- కాస్త దూరంగా వున్న గార్డెన్‌లో పూలమొక్కల ప్రక్కగా సిమెంటు బెంచి మీద కూర్చున్న జంటని చూస్తూనే తెలిసున్న ముఖంలా అనిపించి ఆగిపోయాడు.

తల వెనక్కి తిప్పి వాళ్లను చూశాడు.

తెల్లని పంజాబీ డ్రెస్‌లో, మెడలపైకి జారిన పోనీటైల్‌తో, భుజానికి బ్యాగ్‌తో తెలిసున్నట్లు అనిపించిన ఆ ముఖం సాక్షాత్ అతని కూతురు శైలజదే. ఆమె పక్కన భుజాలు రాసుకునేటంత దగ్గరగా ఎవరో యువకుడు.

జగన్నాథంకి ఒంట్లోని రక్తం అంతా ఒక్కసారి ముఖంలోకి చిమ్మింది.

జగన్నాథం తమాయించుకుంటూ చప్పున చెట్లచాటుకి తప్పుకున్నాడు.

ఈ సమయంలో శైలూ కంప్యూటర్ క్లాసుకి వెళ్లాలి కదా. మరి ఇక్కడుందేమిటి? ఇంతకీ ఆ యువకుడు ఎవరు? లవరా? లవ్వరే! లేకపోతే అంత దగ్గరగా ఎందుకు కూర్చుంటుంది? వేరే ఎవరితోనో ఇక్కడికి రావాల్సిన అవసరం ఏమిటి? ఎన్నాళ్లనుంచి నడుస్తోంది ఈ వ్యవహారం.

జగన్నాథంలో తీవ్ర అలజడి...

పరిశీలనగా వాళ్లిద్దరినీ చూశాడు.

నిస్సందేహంగా ఆ అమ్మాయి తన కూతురు శైలజే. దాన్ని అంటుకుని కూర్చున్న ఆ యువకుడు కూడా అందంగా, స్టయిల్‌గా వున్నాడు. హ్యాండ్‌సమ్ గై. పైగా డిగ్నిఫైడ్‌గా కూడా ఉన్నాడు.

జగన్నాథం నెమ్మదిగా వాళ్లిద్దరూ కూర్చున్న బెంచి వెనకవైపు దగ్గరగా వెళ్లి చెట్లచాటున నిల్చున్నాడు.

శైలజ అంటోంది- 'ఏమో నీరజ్! నాకు చాలా భయంగా వుంది. నాన్నకి తెలిస్తే చంపేస్తాడు. మా నాన్న అంటే మా ఇంట్లో అందరికీ భయం. పైగా మా నాన్న బాగా ట్రెడిషనల్. ఇంటర్‌క్యాస్ట్ మ్యారేజి అంటే ఆయనకు అస్సలు ఇష్టం వుండదు. పూజలు- వ్రతాలు- దేవుడు- అంటు- మైల- అంటూ ఇలాంటివన్నీ తప్పక పాటిస్తాడు. మన ప్రేమని ఆయన ససేమిరా ఇష్టపడరు. సరికదా నన్ను కట్టడి చేస్తాడు. నన్ను చంపినా చంపుతాడు. మన ప్రేమ గురించి చెప్తే మా ఇంట్లో యుద్ధమే అవుతుంది' అంది.

అతను విసుగ్గా చూశాడు.

'అయితే ఏమంటావ్ శైలూ?'

'మన గురించి నేను మా నాన్నకి చెప్పనా.'

'పోనీ నన్ను చెప్పమంటావా?'

'అమ్మో వద్దు. నాకు భయం' అరుస్తున్నట్లు అంది శైలజ.

'మరి ఎలా శైలూ! నువ్వు చెప్పవ్. నన్ను చెప్పొద్దంటావ్. ఇంకెలా. అందుకే నేను చెప్పేది కరక్టే. మనం ఇద్దరం రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుని ఆయన ముందుకి వెళదాం. అప్పుడు ఆయన నిన్నేం చెయ్యలేరు. మనల్ని ఆదరించడు సరే. లేకపోయినా ఒరిగేది లేదు. నువ్వు కట్టుబట్టలతో నా వెంట వచ్చెయ్యొచ్చు. నా అభిప్రాయం. ఇదే

సరి అయిన పద్ధతి' అన్నాడు.

'నిజమే నీరజ్! నువ్వు చెప్పిన పద్ధతి బాగానే వుంది. కానీ మా నాన్నకి బి.పి. ఆయన అప్‌సెట్ అయి ఏ గుండెజబ్బన్నా తెచ్చుకుంటే నేను సుఖంగా వుండగలనా. నువ్వే చెప్పు.'

నీరజ్ కోపంగా అన్నాడు- 'శైలూ! వేలికి వస్తే కాలికి, కాలికి వస్తే వేలికి అంటున్నావ్. అసలు నాకేమనిపిస్తోందో తెలుసా, నీకు నేనంటే ఇష్టం లేదని' చివ్వున బెంచిమీంచి లేచి నిల్చున్నాడు.

శైలజ కంగారుగా అతడి చేతిని పట్టుకుంది.

'అంత మాట అనకు నీరజ్... నీకు తెలియదా నా మనసు? నువ్వు లేకుండా నేను బతకలేను.'

శైలజ గొంతు చాలా దీనంగా వుంది.

కానీ నీరజ్ చాలా సీరియస్‌గా అన్నాడు- 'శైలూ! ఇలాంటి కబుర్లు వినే తీరిక నాకు లేదు. ఆఖరిసారిగా చెప్తున్నాను. ఇక్కడ నా ట్రెయినింగ్ అయిపోయింది. నాకు బెంగుళూరులో చాలా మంచి జాబ్ వచ్చింది. ఇంకొక నాలుగు నెలల్లో కంపెనీవాళ్లు నన్ను జపాన్ పంపుతున్నారు. ఇంక నాకు ఇక్కడికి వచ్చే అవసరంగానీ, పనిగానీ లేదు. ఇన్నాళ్లూ మా అమ్మమ్మ-తాతయ్య నా చదువు కోసం ఇక్కడ ఇల్లు అద్దెకు తీసుకుని వున్నారు. ఇంక వాళ్లు కూడా మావయ్య దగ్గరకి ఏలూరు వెళ్లిపోతున్నారు. ఇంక నేను ఇక్కడికి రావడం అంటే నీ కోసమే. ఒకవేళ కంపెనీ నన్ను వెంటనే జపాన్ పంపిస్తే నీకు నాకు మధ్య చాలా దూరం పెరిగిపోతుంది. అందుకే ఆఖరిసారిగా చెప్తున్నాను. మనం వెంటనే పెళ్లి చేసుకుంటే మంచిది. నేను నీకు కావాలి అనుకుంటే ఈ నెలాఖరికి నాతో రావటానికి సిద్ధంగా ఉండు.'

'కానీ ఎలా? మా నాన్న ఒప్పుకోడు. ఇంటర్‌క్యాస్ట్ వివాహానికి ఆయన చాలా వ్యతిరేకం.'

'ఆ మాట కాదు. ఇంకో మాట ఏదన్నా చెప్పు' కొట్టినట్లు వుంది నీరజ్ గొంతు.

'ప్లీజ్ నీరజ్! నాకు ఎటూ తోచటం లేదు. కాస్త నా పరిస్థితి అర్థం చేసుకో. మన విషయం చెప్తే నన్ను చంపినంత పని చేస్తాడు సరికదా కట్టుదిట్టం చేస్తాడు.'

'అందుకే నేను చెప్తున్నానా శైలూ... మనం ఇద్దరం పెళ్లి చేసుకుని మీ నాన్న ముందుకి వెళదాం.'

'అమ్మో! నాన్నకి చెప్పకుండా నేను అలా చేస్తే నాన్న తప్పక గుండెనొప్పి తెచ్చుకుంటాడు. నేను ఒక్కర్తినే సంతానం కావటం వల్ల నన్ను చాలా అపురూపంగా చూసుకుంటున్నాడు. నాకు ధైర్యం చాలడం లేదు.'

నీరజ్ విసుగ్గా లేచి నిల్చున్నాడు.

'శైలూ! నాకు ఒక్కటే అనిపిస్తోంది. నీకు అసలు నా మీద ప్రేమ లేదు. మీ నాన్నకి చెప్పటానికి భయం అంటావ్. నన్ను చెప్పొద్దు అంటావ్. పెళ్లి చేసుకుందాం అంటే వద్దంటావ్. ఇంకెలా...' అతడి ముఖం చిన్నబోయింది.

శైలజ బ్రతిమాలుతున్నట్టుగా అతడి చేతిని పట్టుకుంది.

'వద్దు. అంత మాట అనకు. నాకు పిచ్చెక్కేలాగా వుంది. నన్ను కాస్త ఆలోచించుకోనియ్యి.'

నీరజ్ నవ్వాడు.

'ఎంతకాలం? నేను జపాన్ వెళ్లిపోయేదాకా ఆలోచిస్తూనే ఉండు. నేను ఓ జపాన్ పిల్లని పెళ్లి చేసుకుని అక్కడే స్థిరపడతాను...'

'ఆం యు నాటీ' శైలజ అతడి భుజం మీద కొట్టింది.

ఇద్దరూ లేచి గార్డెన్ బ్లాక్‌లోంచి బయటికి వచ్చి పార్కింగ్ వైపు వచ్చారు. మెరూన్ రంగులో వున్న మారుతి థౌజండ్ బయటికి తీశాడు. శైలజ అతడి పక్కన కూర్చుంది. జగన్నాథం కళ్లముందే కారు వెళ్లిపోయింది.

జగన్నాథం నిస్సత్తువగా చెట్ల నుంచి ఇవతలకి వచ్చి వాళ్లు ఖాళీ చేసిన బెంచి మీద కూర్చున్నాడు. అతని అరచెయ్యి ఎడంపక్క ఛాతి మీదికి వెళ్లలేదు. కానీ అంత పరిస్థితి వుంది. అతడి కళ్లు తిరుగుతున్నట్లుగా వుంది. అతడి మనసంతా తుఫాను వచ్చినట్లు చిందరవందరగా వుంది.

ఎంతో ఉత్సాహంగా నర్సరీ మేళాకి వచ్చిన స్ట్రిక్ట్ ఆఫీసర్ జగన్నాథం తన ప్రియమైన మొక్కలు కొనకుండానే తిరిగి కారుని ఇంటికి పోనిచ్చాడు.

జగన్నాథం ఇంటికి వచ్చేసరికి సమయం ఏడున్నర కావచ్చింది.

శైలజ ఇంటికి రాలేదు. కంప్యూటర్ క్లాస్ ఎనిమిదింటికి పూర్తవుతుంది. స్కూటీ మీద ఇంటికి వచ్చేసరికి పావుగంట పడుతుంది.

రోజులాగే ఆ రోజు ఎనిమిది ఇరవై అవుతుంటే ఇంటికి వచ్చింది. ఎప్పటిలా తన గదిలోకి వెళ్లిపోయింది.

జగన్నాథం కళ్లు మాటిమాటికీ ఎరు పెక్కుతున్నాయి. ఆ రాత్రంతా ఆయన ఆలోచిస్తూనే వున్నాడు.

❖ ❖ ❖

ఆ మర్నాడు ఉదయం అలవాటుగా వాకింగ్ చేసి వచ్చి ఇంటి ముందున్న చిన్న గార్డెన్‌లో మొక్కలకి నీళ్లు పెడుతున్నాడు. జగన్నాథం భార్య వంటగదిలో వుంది.

'డాడీ... కాఫీ!' అంటూ శైలజ కాఫీ ట్రే తెచ్చి గార్డెన్ ఛెయిర్స్ ముందున్న చిన్న రాతి టేబుల్ మీద పెట్టింది.

వెళ్లబోతున్న కూతురితో- 'శైలూ... కొంచెం ఆగు' అంటూ చేతిలోని నీళ్ల పైపు శైలజకి ఇచ్చి కాఫీ కప్పు అందుకున్నాడు.

రాత్రంతా ఉబ్బి, ఎర్ర జీరలు పులుముకున్న ఆయన కళ్లు స్వచ్ఛంగా నందివర్ధనాల్లా వున్నాయి.

'ఏంటి డాడీ?' అంది శైలజ గులాబీ మొక్కలపై నీళ్లు చిందిస్తూ.

'శైలూ... నీరజ్ ఎవరు?'

ఉదయాన్నే పిడుగులా వచ్చిన ఆ ప్రశ్నకి శైలజ ఉలిక్కిపడింది. ఆమె చేతిలోని పైపు జారి కిందపడింది. గొట్టంలోంచి పైకి ఎగజిమ్మిన నీళ్లు ఇద్దరి మీదా చివ్వున చిందాయి.

'డా...డీ...!?' కిందపడ్డ గొట్టం తీసి తిరిగి మొక్కల వైపు తిప్పింది.

వణుకుతున్న కూతురి చేతిని గమనించిన జగన్నాథ్ మృధువుగా ఆ చేతిని పట్టుకున్నాడు.

'శైలూ... ఆ నీరజ్‌ని మనింటికి టీకి పిలువ్. అతడు జపాన్ వెళ్లేలోగా మీ మ్యారేజ్ డేట్ ఫిక్స్ చెయ్యాలి కదా?' చిరునవ్వుతో తన అరచేతిని కూతురి తలమీద వేశాడు.

శైలజ మతిపోయిన దానిలా తండ్రికేసి చూసింది.

'మీ...కా...వి...!?'

'ఎలాగైతేనేం... నాకు తెలిసింది. సరేనా?'

'అ...ది.., కాదు.... అతడు... మన క్యా.... కాదు...'

'నువ్వు ఏ కులం వ్యక్తిని చేసుకుంటున్నావు అని కాదు. నువ్వు ఎంత సుఖంగా వున్నావు అన్నది నాకు ముఖ్యం. నా కూతురి మనసు నేను తెలుసుకోలేనా?'

చేతిలో నీళ్ల ట్యూబ్ గిరాటేసి తండ్రి కాళ్ల మీద పడినంత పని చేసింది.

'డాడీ! నువ్వెంత మంచివాడివి?' అంటూ తూనీగలా ఇంట్లోకి పరిగెత్తింది.

కళ్లనిండా నీళ్లు నిండుతుంటే ఇంట్లోకి పరిగెత్తిన కూతుర్ని చూస్తూ అలా నిలుచుండిపోయాడు.

చదువు, సంస్కారం, ఉన్నత వ్యక్తిత్వం, మారుతున్న కాలాన్ని అర్థం చేసుకునే వివేకం, పుష్కలంగా వున్న స్కాలర్- జగన్నాథ్. తనకి రుచించకపోయినా యువత మనోభావాలు అర్థం చేసుకుని, మారుతున్న కాలంతో మారగల వ్యక్తిత్వం జగన్నాథంది.

నిన్న పార్కులో వాళ్ల మాటల్ని బట్టి ఆ నీరజ్ బాగా చదువుకున్న మంచి ప్రయోజకుడు అని అర్థం అవుతోంది. చూపులకి బాగున్నాడు. భార్య సుఖపడటానికి అంతకంటే ఎక్కువ ఎందుకు?

కులం-మతం కేవలం చెప్పుకోవటానికే కానీ చదువు-సంస్కారం మనిషికి గీటురాళ్లు. ప్రేమా-దోమా అంటూ ఆడపిల్లల్ని మోసం చేసి పెళ్లి అనేసరికి మొఖం చాటుచేసే వాళ్లున్న ఈ రోజుల్లో- 'పెళ్లి చేసుకుందాం' అని బ్రతిమాలుతున్న ఆ యువకుడు నిస్సందేహంగా యోగ్యుడు. పైగా శైలజని ఇష్టపడుతున్నాడు. గొప్ప కులం, ఆస్తి, అంతస్తు చూసి చేసినా, నీరజ్ కంటే యోగ్యుణ్ణి తను తేగలడా? ఇద్దరూ కలసి బ్రతకటానికి కావలసినవి అవన్నీ కాదు. అంతకంటే ముఖ్యం పరస్పర ప్రేమ, అవగాహన.

జగన్నాథం రాత్రంతా ఆలోచించగా చివరికి నిగ్గుతేలిన అభిప్రాయం అది. నీరజ్ శైలజకి తగిన వరుడు. నా అల్లుడు అనుకున్నాడు.

అందరు తండ్రులూ జగన్నాథంలా వివేకంగా ఆలోచించగలిగితే ఎంత బాగుంటుంది? ❑